Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# తెలుగు కవిత్వం లో ప్రవహించిన నదులు

## (TELUGU KAVITWAMLO PRAVAHINCHINA NADULU)

**[1]Dr. Marke Poloneyes and [2]S Rakesh**
[1]Assistant Professor, Head, Department of Telugu & Principal
University P.G Centre Kollapur, Palamuru University Mahabubnagar, Telangana
[2]Junior Lecturer in Telugu, Government Junior College Boys Mahabubnagar,Mahabubnagar District, Telangana, India

''నిను వీక్షించుచు గూరుచుండుటది యంతే చాలు నో తల్లి బం
ధునికాయంబులు చూడ వచ్చినటు, మిత్రుల్ జేరి యాత్మీయ భా
షణల్ జేసిన యట్లు, సత్కవుల వాచా మాధురుల్ విన్న య
ట్లనుభూతుల్ గలిగించు వీ యెడద నృత్యత్కకి గోదావరీ'' [కొత్త గోదావరి పద్య కవితా సంపుటి
బేతవోలు రామబ్రహ్మం గారు ]

"ఓతల్లీ! గోదావరీ! నిన్ను చూస్తూ కూర్చుంటే చాలు బంధువులంతా చూడటానికి వచ్చినట్టు, స్నేహితులు దరి చేరి ఆత్మీయంగా మాట్లాడినట్టు, సత్కవుల మధురమైన వాక్కులు విన్నట్లు హృదయంలో అనుభూతులు కలుగుతాయి".

జలం సమస్త ప్రాణి కోటికీ జీవనాధారం. నీరులేని జీవం నిర్జీవం. మానవ జీవితం ఆద్యంతం నీటితో ముడిపడి ఉంటుంది. మనం అమ్మ కడుపులో ఉన్నప్పుడు మొదలైన నీటి అక్కర, అంతిమ యాత్ర వరకూ కొనసాగుతుంది. ఆహారం లేక పోయినా కొంత కాలం మనుగడ సాగించ గల ప్రాణి, నీరు లేకుంటే భువి పై మనలేదు. దాహార్తిని తీర్చుకోవటానికి, క్షుద్బాధను పోగొట్టుకోవటానికి, దుర్గంధాన్ని మాపుకోవటానికి, చీకటిని పారద్రోలటానికి, ఇలా మన బతుకుల్ని పండించుకోవటానికి జలధారలను మనకు ధారపోస్తున్న నదులు అనంత ప్రాణి కోటిని పెంచి పోషిస్తున్న తల్లులు.

నీటికి మనిషికి గల అవినాభావ సంబంధాన్ని అర్థం చేసుకున్న ఆది మానవులు, నదీ తీర ప్రాంతాలు తమ మనుగడకు అనువైనవిగా భావించారు. సంచార జీవితానికి స్వస్తి పలికి , నాగరికతకు స్వాగతం పలికారు. జీవితాలను సుసంపన్నం చేసుకున్నారు. పంటలు పండించటం ప్రారంభించటంతో , ఆహారం కోసం అన్వేషించవలసిన అక్కర తగ్గింది. విరామ సమయ మేర్పడింది. వివిధ విషయాలు కనిపెట్టడానికి వీలు చిక్కింది. తమ జ్ఞాన తృష్ణను తీర్చుకునే దిశగా మానవ మహా ప్రస్థానం కొనసాగింది. నదులు మానవులకు మంచి జీవితాలను ప్రాసాదించటంతో పాటు, వారి మనో వల్మీకంలో దాగిన అనేక ఊహలకు రెక్కలిచ్చాయి. అనిర్వచనీయమైన అనుభవైక వేద్యమైన లలిత కళల వైపు మానవుని దృష్టి మళ్లింది. చుట్టూ ఉన్న ప్రకృతే లలిత కళలకు ఆలంభన అయ్యింది. ముఖ్యంగా నదులు నిత్య చలన శీలతతో మనిషిలోని భావుకతను ఉద్దీపింప చేశాయి. నదుల నడకల హొయలు, వాటి గలగల రవళులు, వాటి గంభీరత, కొండొకచో వాటి ఉగ్ర రూపం, మనిషిలోని భావుకతను ఉద్దీపింప చేసాయి. స్రవంతులు కవితా సృజనకు ప్రేరణగా నిలిచాయి.

మానవ జీవితంతో మమేకమైన నదులు తెలుగు సాహిత్యం లోకి పరవళ్ళు తొక్కుతూ ప్రవహించాయి. ఆది కావ్యం నుండి మొదలైన ఈ రస రమ్య ప్రవాహం ఆధునిక సాహిత్యం వరకూ అపారంగా కొనసాగుతూనే ఉంది.

తెలుగు సాహితీ కల్పవృక్షం శాఖోపశాఖలుగా విస్తరించింది. ప్రాచీన, ఆధునిక కవిత్వ ప్రక్రియలన్నింటా సందర్భాను సారంగా నదుల ప్రస్తావన ఉంది. నదులే ప్రధాన పాత్ర పోషించిన రచనలూ ఉన్నాయి.

ఆంధ్ర మహా భారతం లో గంగా నది

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

సంస్కృతంలో వేదవ్యాసుడు రచించిన భారతాన్ని నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, ఆంధ్రీకరించారు. ఈ ముగ్గురిని కవిత్రయం అంటారు. భారతం లో 18 పర్వాలున్నాయి. ఆది సభాపర్వాలను పూర్తిగానూ, అరణ్య పర్వంలో సగ భాగాన్ని నన్నయ ఆంధ్రీకరించారు. "విరాట,ఉద్యోగ , భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ, శాంతి, అనుశాసనిక,అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహా ప్రస్థాన, స్వర్గారోహణం" అను పదిహేను పర్వాలను తిక్కన ఆంధ్రీకరించారు. నన్నయ రాయగా మిగిలిన అరణ్యపర్వ శేషాన్ని ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

ఆంధ్ర మహా భారతం లో ఆది పర్వంలో గంగానదికి సంబంధించిన కథ ఉంది.

"నరవరుడగు శంతనునక
మరనదికిని నెట్లుసంగమంబయ్యె మహా
పురుషుండు భీష్ముడెట్ల
య్యిరువురకును బుట్టె దీని నెఱిగింపు మొగిన్"

"రాజులలో శ్రేష్ఠుడైన శంతనునకు, దేవనది అయిన గంగకు ఎలా వివాహం జరిగింది? వారికి భీష్ముడు ఎలా జన్మించాడు? దీనిని తెలియ జేయమని జనమేజయుడు, వైశంపాయనుడిని అడిగాడు".

"గంగా దేవి స్త్రీ రూపం ధరించి బ్రహ్మ సభకు రావటం, ఆమె కట్టుకున్న చీర గాలికి ఎగిరి తొడల పైభాగం కన్పించటం, అక్కడ ఉన్నవారు ముఖాలు పక్కకు తిప్పుకోగా, మహాభిషుడు గంగాదేవిని తదేకంగా చూడటం, బ్రహ్మ కోపగించి శపించడం, మహాభిషుడు భూలోకంలో శంతనుడిగా జన్మించడం, గంగాశంతనుల వివాహం, అష్ట వసువుల జననం ఇత్యాది విషయాలన్నీ ఇందు వర్ణించ బడినవి.

<u>ఆంధ్ర మహా భారతంలో పుణ్య తీర్థాలు</u>

అరణ్య పర్వంలో ధర్మరాజు తీర్ధ యాత్రలు చేసిన వారికి ఎటువంటి పుణ్య ఫలితాలు కలుగుతాయో తెలియ జేయమని నారదుడిని అడుగుతాడు.

నారదుడు పుష్కర క్షేత్ర మహత్యంతో పాటు జంబూ మార్గం, అగస్త్య సరోవరం, కోటి తీర్థము, , నర్మదానది, దక్షిణ సింధువు, పింగళ తీర్థము, ప్రభాస తీర్థము, సరస్వతి సాగర క్షేత్రము, సింధు నదీ సంగమం, సింధూత్తమ తీర్థం, బ్రహ్మ తుంగం, విమల తీర్థము, దేవికాతీర్థం, సరస్వతీనది, ఆదిగా గల అనేక పుణ్య తీర్థాల మహత్యాన్ని వివరించాడు.

కురుక్షేత్ర మహిమను గూర్చి తెలియజేస్తూ , సర్పి తీర్థం, వరాహ తీర్థము, అశ్వినీతీర్థము, మాతృ తీర్థం, సోమ తీర్థము, కృతాశౌచం, అగ్నివటం, పంచవటం, శరవణతీర్థం, యక్షిణితీర్థం, కాయశౌచ క్షేత్రం, సూర్య తీర్థం, మానుష క్షేత్రం, కపిల తీర్థం, శ్రీ తీర్థం, సప్తర్షి కుండము, కపిల కేదారము, మూడుకోట్ల చిన్న నదులు కల ఇలా పర్వం, కిందాన కింజల్ప తీర్థాలు, వైతరణి తరంగిణి , ఫలకీ వన తీర్థము, మిశ్రక తీర్థం, నరక తీర్థము, బ్రహ్మా వర్తంలో శరవణ తీర్థం, నైమిష కుంజం, బ్రహ్మ తీర్థం, ఆదిగా గల అనేక పుణ్య తీర్థ మహత్యాలను తెలియ జేశాడు.

సప్త సారస్వత ప్రభావంతో పాటు , ఔశనము, కపాల మోచనము,విశ్వామిత్రము, కార్తికేయము, సరస్వతీ సుకన్యా నదీ సంగమం, శత తీర్థం, గంగ మడుగు, దధీచి తీర్థం, జ్ఞానపావనం, సౌగంధికం, దేవ శ్రవ, పూనిత ప్రాదం, సుగంధం, శాత కుంభం, పంచ యక్షం, శాకంబరీ తీర్థం, ధూమా వతి, గంగా ధార, సప్త గంగా సంగమం, త్రిగంగా సంగమం, గంగా సరస్వతీ సంగమం, ఆదిగా గల అనేక పుణ్య తీర్థ మహత్యాలను విశదీకరించాడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

నైమిశ తీర్ధ మహత్యంతో పాటు, గోమతీ తీర్థం, గంగా గోమతీ సంగమం, కోటి తీర్థం, కపిలా నది హ్రదం, గయా పరిసరం లోని ఫల్గు తీర్థం, అహల్యా హ్రదం, జనక రాజర్షి కూపం, మహా నది, కంపన తీర్థం, దేవ పుష్కరిణి, మహేశ్వర పథం, సాల గ్రామ తీర్థం, కన్యా సంవేద్య తీర్థం, కౌశిక హ్రదం, అగ్ని ధార, పితామహ సరోవరం, కుమార ధార, గౌరీ శిఖర కుండం, నందినీ కూపం, కాళిక కౌశికా తరంగిణుల సమ్మేళన స్థానం, బదరీ తీర్థం, రామ తీర్థం, శ్రీ శైలం లో గల దేవ హ్రదం, కావేరి తీర్థం, కన్యా తీర్థం, సప్త గోదావరీ తీర్థం మొదలైన తీర్థ మహత్యాలను కొనియాడాడు.

వాటి ప్రత్యేకతలు వివరిస్తూ ఆయా పుణ్య తీర్థాలలో స్నానమాచరించడం వలన ధన్యులౌతారని, సుకృత ఫలం చూరగొంటారని, అనేక అశ్వమేధ, రాజ సూయ యాగాల ఫలితం కరతలామలకం కాగలదని, సమస్త పాతకాలు కనురెప్ప పాటులో నశిస్తాయని, దైవత్వం సిద్ధిస్తుందని, విశేష ధన ధాన్య సంపత్తి లభిస్తుందని, వేయి గోదానాల ఫలితం ప్రాప్తిస్తుందని, పాప పీడ తొలగుతుందని, సౌఖ్యం సమకూరు తుందని, సువర్ణ దాన సుకృతం లభిస్తుందని, దేహ గత వ్యాధులు నిమిష కాలంలో నశిస్తాయని, దురిత రాశి నశించి అమరత్వం లభిస్తుందని, పుణ్య లోకాలలో ప్రవేశించి అభీష్ట భోగాలతో ఆనందిస్తారని ఇలా అనేక విశేష ఫలితాలు పొందుతారని నారదుడు వివరించాడు.

అనుశాసనిక పర్వం లో "పుణ్యతీర్థ విశేష వర్ణన" కలదు. ఇందులో చంద్ర భాగ, వితస్త, ఊర్మిమాలిని, పుష్కరము, ఇంద్ర మార్గము, దేవిక, స్వర్ణ బిందువు, హిరణ్య బిందువు, ఇంద్ర తోయ, కర తోయ, కనఖలం, గంగా ద్వారం, భ్రుగు తుంగం, కన్యాకూపం, సుందరికా హ్రదం, వైమానిక తీర్థం ,ఆదిగా గల అనేక పుణ్య తీర్థముల విశేషాలను గూర్చి భీష్ముడు ధర్మ రాజుకి వివరించాడు.

<u>ప్రభాస తీర్థ మహిమ</u>

శల్య పర్వంలో వైశంపాయన ముని జనమేజయునికి "ప్రభాస తీర్థ" మహిమను గూర్చి ఇలా వివరించాడు.

"పూర్వం చంద్రుడు అశ్విని , భరణి, కృత్తిక, రోహిణి మొదలైన ఇరవై ఏడు మంది దక్షుడి కుమార్తెలను వివాహం చేసుకున్నప్పటికీ వారిలో మిక్కిలి అందగత్తె అయిన రోహిణి యందు మిక్కిలి మక్కువ గలవాడై మిగిలిన వారిని అలక్ష్యం చేశాడు. ఆ కన్యలు ఈ విషయమై తండ్రికి మొరపెట్టుకున్నారు. నిష్పక్షపాత దృష్టి తో ప్రవర్తించక పోతే శపిస్తానని దక్షుడు చేసిన హెచ్చరికను చంద్రుడు అలక్ష్యం చేశాడు. దాంతో కోపించిన దక్షుడు "నిరంతర క్షయ వ్యాధి తో పీడించబడతావని" చంద్రుడిని శపించాడు. దేవతల కోరిక మేరకు దక్షుడు సరస్వతీ సాగర సంగమ ప్రదేశం లో చంద్రుడు ప్రతి నిత్యం స్నానవిధి నిర్వర్తించినచో క్రమ క్రమంగా వృద్ధి క్షయాలు కలుగుతాయని, అమావాస్యనాడు స్నానం చేయగానే వృద్ధి సంభవిస్తుందని శాప విమోచనం తెలిపాడు. చంద్రుడు ఆ ప్రకారమే చేసి లోకాలకు ఆనందం కలిగించాడు. ఆ తీర్థం ప్రభాస తీర్థ మనే పేరుతో సుప్రసిద్ధ మైంది."

<u>నదీ సముద్ర సంవాదం</u>

శాంతి పర్వం లో 'నదీ సముద్ర సంవాదం' ఉంది. ఇది బలహీనుడైన రాజు బలవంతుడైన రాజు దగ్గర ఎలా మెలగాలో తెలియజేసే కథ. శత్రువు అత్యంత బలవంతుడైనప్పుడు, స్వల్ప బలవంతుడైన రాజుకి గత్యంతర మేమిటని ధర్మరాజు అడుగగా దేవవ్రతుడు "సరిత్సముద్ర సంవాదమన్న" పురాతన ఇతిహాసాన్ని వివరించాడు.

"ఒకరోజు సముద్రుడు నదీ పత్నులతో మాట్లాడుతూ, మీరు ఉప్పొంగినపుడు ఏటి ఒడ్డున ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను త్రుటికాలం లో నిర్మూలిస్తున్నారు. కానీ ప్రబ్బ తీగలను గుబురులను కొంచెం కూడా కదలించక

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

పోవటానికి కారణమేమిటి? అని అడిగాడు. ఆమాటలకు ఆ వాహినుల మధ్యలో ఉన్న గంగాదేవి ఆ వృక్షాలు గర్వంతో విర్రవీగుతున్నాయి. అందుకే వాటిని కూల్చి వేస్తున్నాం. ఇవి ప్రవాహ వేగంతో తలవంచి మాకు నమస్కరిస్తున్నాయి. వరద తగ్గినంతనే తలలు ఎత్తి తమ మనుగడ కొనసాగిస్తున్నాయి అని చెప్పింది. కావున శత్రువు బలం గమనించి తలవంచిన రాజుకి ఆపద రాదు."

ఇలా ఆంధ్ర మహాభారతం లో పుణ్య క్షేత్ర సందర్శనం, వాటిలో స్నానమాచరించడం సత్ఫలితాన్ని ఇస్తాయని ఆయా సందర్భాల్లో పేర్కొన్నప్పటికీ, 'పుణ్యతీర్థ విశేష వర్ణన' చివరలో

" కామ క్రోధ మద మోహ లోభావేశాలు ఒక ఇంచు కైనా లేని నిర్మల మనసుతోనే పుణ్యతీర్థ సేవకు ఉపక్రమించాలి. శమము, దమము, అహింస, నిరంతర తపో నిరతి ఆదిగా గల సద్గుణాలతో ఆయా పుణ్యతీర్థావళి సందర్శించాలి. అంతేగాని వట్టి నీళ్ళలో మునిగి నంత మాత్రాన ప్రయోజనం ఉండదు. మమత్వ రహితులైన వారు ధన్యులు. అటువంటి ధన్యాత్ములకు తీర్థ సేవతో పనిలేదు". అని పేర్కొన బడినది.

భగీరథుడు గంగను భూమికి తెచ్చుట

భగీరథుడు శాప గ్రస్తులైన తన పితామహులకు ఉత్తమగతులు కల్గించే లక్ష్యంతో తపస్సు కొనసాగించి దేవ నదియైన గంగను భూమికి రప్పించిన గాథ తెలుగు వారికి సుపరిచితమే. సంకల్ప సిద్ధి కోసం పదే పదే ప్రయత్నిస్తున్న వారిని ఉద్దేశించి "భగీరథ ప్రయత్నమని"వ్యవహరించటం కద్దు. భాగవత రామాయణాలలో గంగ దివి నుండి భువికి ఏతెంచిన గాథ మనోహరంగా వర్ణించ బడినది.

ఆంధ్ర మహాభాగవతం లో గంగా నది

సంస్కృతంలో వేద వ్యాసుడు రచించిన భాగవతాన్ని భక్త కవిగా పేరు పొందిన బమ్మెర పోతన తెనిగించారు. "భాగవతం నవమ స్కంధం" లో గంగానదీ ప్రవాహ మహిమాను వర్ణన ఉంది. ఈ సందర్భం లో పోతన పరమేశ్వర జటా జూట నిర్గత గంగా నదీ ప్రవాహాన్ని అతి పెద్ద వచనంలో పాఠకులు పరవశించేలా, నదీ ప్రవాహాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన అనుభూతి కలిగేలా వర్ణించారు .

"ఇట్లమ్మహానది పురారాతి జటాజూట రంధ్రంబు వలన దిగబడి, నిరర్గళ ప్రవహంబై , యిలకు జల్లించి, నెఱసి, నిండి పెల్లు వెల్లిగొని, పెచ్చు రేగి, విచ్చల విడి గ్రేపు వెంబడి నుఱక క్రేళ్ళురుకు మఱక ప్రాయంపు గామ ధేనువు చందంబున ముందరికి నిగుడుచు ------------"ఇలా ఆ వర్ణన కొనసాగింది.

రంగనాథ రామాయణం లో గంగా నది

రంగనాథ రామాయణమును రచించిన కవి గోన బుద్ధారెడ్డి . ఇతడు తన తండ్రి పేర దీనిని వెలయించి రంగనాథ రామాయణ మని పేరుపెట్టాడరు.

ప్రాచీన సాహిత్య ప్రక్రియల్లో ద్విపద ప్రక్రియ పండితపామర జనరంజకమైనది. ద్విపద కావ్యమైన "రంగనాథ రామాయణం బాలకాండలో" భగీరథుడు గంగను భూమికి రప్పించిన కథ ఉంది. ఆ పుణ్య నదిలో అతి పాపారతులు, శాప దగ్ధులు కృత స్నానులై దివికేగిన ట్లు కవి వర్ణించారు.

"దివి కేగ మదిలోన దివురు భూజనుల
కవిరళ నిశ్శ్రేణు లమరు చందమున
నిలయు నింగియు మ్రోగునెడ బ్రవాహంబు,
గలయ నానా మాలికలు వీచు లమర

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

నీ భంగి ద్రిప్పుదు నెల్ల పాపముల
నా భంగి జూడుడీ యన సుడులొప్పు"

“స్వర్గ లోకానికి వెళ్ళా లని భావించే భూజనులకు నిచ్చెనలు అమరిన చందంగా అలలు భాసిస్తుం డగా, పాపాలన్నింటిని ఈ విధం గానే తిప్పుతాను చూడండి అన్నట్టుగా సుడులు తిరుగుతూ గంగా నది ప్రవహిస్తుంది”.

ఈ కథ చదివిన వారు, విన్న వారు అయుష్మంతులౌతారని, వారికి ధన ధాన్య కీర్తులు కలుగుతాయని, వారికి దేవతలు ప్రసన్నులవుతారని, సఖల కార్యాలు సిద్ధిస్తాయని, వారి పితృ దేవతలకు అనుపమ సద్గతులు కలుగుతాయని ఈ కథ చివర లో ఫల శృతి కలదు.

<u>శతకాలలో నదుల ప్రస్తావన</u>

చాలా శతకాలలో నదుల ప్రస్తావన ఉన్నప్పటికీ, అవి నదులకు సంబంధించినవి కాక, వాటిని ఉపమానాలు గా తీసుకుని లోక రీతిని వర్ణించడం కనిపిస్తుంది.

కొన్ని భక్తి ప్రధానమైన శతకాలలో భగవద్భక్తి ప్రధానమని, యాత్రలు చేయటం నదులలో మునక వేయటం వల్ల ఫలితం ఉండదను భావాన్ని వ్యక్తంచేసే పద్యాలున్నాయి.

దాశరథి శతకం లో

" నీ మహనీయ తత్వ రస నిర్ణయ బోధ కథామృతాబ్ధిలో
దామును గ్రుంకు లాడక వృథాతను కష్టము జెంది మానవుం
డీ మహిలోక తీర్థముల నెల్ల మునింగిన దుర్వి కార హృ
త్తామస పంకముల్ విడునె దాశరథీ కరుణాపయోనిధీ”

" ఓ దేవా! నీ మహనీయమనెడి అమృత సాగరము నందు పూర్తిగా మునిగి పోయినచో జ్ఞానము చేకూరును. మనసు నందలి మాలిన్యము నశించును. అంతేగాని తీర్థయాత్రలు చేసి ఎన్ని నదులలో మునిగిననూ మనసు నంటియున్నచెడు భావనల బురద వోదు కదా!”

<u>రామరాజ భూషణుని వసుచరిత్ర</u>

రామరాజ భూషణుడు 1510 - 1585 కాలం వాడు. ఇతనికి భట్టు మూర్తి అనే పేరు కూడా ఉంది. ఇతడు “వసుచరిత్ర” ప్రబంధ రచన ద్వారా శ్లేష కవితా చక్రవర్తిగా పేరు పొందాడు. ఈ ప్రబంధంలో కవి “ శుక్తి మతి నదిని” నాయికగా వర్ణించాడు. ఒకే పద్యం లో శుక్తి మతిని నది పరంగా, స్త్రీ పరంగా వర్ణించి తన శ్లేషార్థ ప్రయోగ నైపుణిని చాటుకున్నాడు.

“ జీవన మెల్ల సత్కవినిషేవితమాశయ మెల్ల స్వచ్ఛతా
పావనతా గభీరతల పట్టు ప్రచారము లెల్ల విశ్వ ధా
త్రీ వలయ త్రికాల ఫల దేశికము ల్నవకంబు లెల్లము
ముక్తావళి విభ్రమస్పదములా నది పెంపు నుతింప శక్యమే “

ఈ పద్యాన్ని నది పరంగా భావించినపుడు శుక్తిమతినది నీటి పక్షులతో, స్వచ్ఛమైన , పవిత్రమైన జలంతోకూడినది. దీంట్లో శంఖాలు, ముత్యాలు ఉంటాయి. ఇటువంటి నదిని పొగడ శక్యమా? అని భావం.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

శుక్తిమతిని స్త్రీ పరంగా భావించి నపుడు ఈమె జీవితం కవులతో చక్కగా సేవించబడేది. ఈమె ఆశయాలు స్వచ్ఛతకు పవిత్రతకు నిలయం. ఈమె సౌందర్యం ముక్తులకు కూడా భ్రమ కలిగిస్తుంది. ఆమెను పొగడ తరమా? అని భావం.

<u>చేమకూర వేంకట కవి విజయ విలాసం</u>

శ్రీ కృష్ణ దేవరాయల అనంతర కాలం కవుల్లో పేరెన్నిక గలవాడు చేమకూర వేంకట కవి. ప్రతి పద్యాన్ని చమత్కారంగా చెప్పగల దిట్ట. రఘునాథ నాయకుని ఆస్థాన కవి.

"చేమకూర వేంకట కవి విరచిత విజయ విలాస ప్రబంధం తీర్థ యాత్రలతో ముడిపడి ఉన్న కథ. అర్జునుడు నియమ ఉల్లంఘన చేసిన కారణంగా ఒక సంవత్సరం భూ ప్రదక్షిణ చేస్తాడు. ఆసందర్భంలో అతడు అనేక పుణ్యతీర్థావళిని సందర్శించినట్లు ఒక పెద్ద వచనంలో కవి వర్ణించారు.

హిరణ్య బిందు తీర్థము, ప్రయాగలో త్రివేణి సంగమం, మణికర్ణిక, గౌతమీ నది ,అంతర్వేదిలోని సాగర సంగమతీర్థం, ఇంద్రద్యుమ్న సరస్సు, ధనుష్కోటి, కృష్ణ వేణి ఆదిగాగల పుణ్య తరంగిణులలో స్నానమాచరించి అనేక దానాలు చేసిన అర్జునుడు గంగాదేవిని అనేక విధాల స్తుతించాడు.

"పెల్లు సెగ జల్లు విస మా
తెల్లని దొర కుతిక మోవ దిని బ్రతుకుట నీ
చల్లదనంబున గాదే?
కల్లోలవతీ మతల్లీ గంగమ తల్లీ!"

" ఓ గంగమ్మ తల్లీ! శివుడు విషాన్ని [హాలాహలం] కంఠం వరకూ తిని కూడా బతికాడంటే అది నీ చల్లదనం వల్లనే కదా!"

" మునకలు గంగా నదిలో .
నొనరించుట కన్న భాగ్య మున్నదే ----" అని అర్జునుడు గంగానదిలో స్నానమాచరించాడు.

ఇంకా ఎందరో ప్రాచీన కవులు తమ కావ్యాలలో నదులకు సముచిత స్థానమిచ్చి సత్కరించారు.

"ప్రాచీన సాహిత్యం లో నదులు మానవ రూపాన్ని ధరించటం, మానవులు నదులుగా అవతరించటం ఇత్యాది కథలున్నాయి. దేవతలు చెడు సంకల్పంతో దైవత్వాన్ని కోల్పోయినప్పుడు వారిని మనుషులుగా పుట్టమని శపించటం, మనుషులు మనీషులుగా మారినప్పుడు పుణ్య నదులుగా అవతరించమని వరాలివ్వటం ప్రాచీన సాహిత్యం లో గమనించ దగిన అంశం."

<u>జానపద సాహిత్యంలో గంగా నది</u>

తెలుగు సాహిత్యంలో జానపద సాహిత్యం ప్రత్యేక శాఖ. ఈ సాహిత్యంలో కూడా నదుల ప్రస్తావన ఉంది. నది మీద జీవనం సాగించే వారు ఆ నదీమ తల్లులను పూజ్య భావంతో ప్రస్తుతించిన పాట

''గంగమ్మ తల్లికి చెంగల్వ పూదండ
కాళిందికి చెల్వ పూదండ
గోదావరికిగొజ్జంగి పూదండ - - - "

బి.రామరాజు గారు ఈ పాటను గూర్చి " గోదావరి ఎదపై తెలుగు తెర చాప లెప్పుడు లేచినవో, ఆనాటినుండి గంగమ్మ తల్లి ఈ పాట విను చునే ఉన్నది. టెంకాయలు, కుంకుమ అందుకునుచునే ఉన్నది". అని పేర్కొన్నారు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

జానపద సాహిత్యంలో " గంగా దేవి వివాహం" అనే ప్రసిద్ధ కథా గేయం ఉంది. జానపదులు గంగను పవిత్ర నదిగాక, సామాన్య స్త్రీగా, తమ ఇంటి బిడ్డగా భావించి అల్లిన కథ ఇది.

గంగ తన సరి వారు లేరని ఉప్పొంగి అంతటనూ వ్యాపించి తుంపరలు చెదరగా దూకుతుండగా, ఆ తుంపరలు కైలాస మందున్న శివుని పై పడ్డాయి. అంతట శివుడు కోపించి

" విష్ణు పదముల బుట్టి వెలసినావని నీవు
గర్వ మొందుట తగదు గంగరో నీకు
నీచు వాసన చే నిలయమై యున్నట్టి
జాలరి కుల మందు జన్మించ బొమ్మా" అని శపించాడు.

ఇలా జానపదులు ఒక కథ అల్లుకుని ఒక శాపాన్ని కల్పించి, తమకు జీవనాధారమైన గంగమ్మను తమ ఆడబిడ్డగా భావించుకుని మురిసిపోయిన కథ ఇది. జాలర్లు ఇంట పుట్టిన గంగాదేవికి శివునితో వివాహం జరుగుతుంది.

ఆధునిక కవిత్వంలో నదులు

ఆధునిక కవిత్వం లో నదులు సరికొత్త మార్గాలలో ముందుకొచ్చాయి. ఆధునిక కవిత్వంలో నదుల నడక అబ్బురంగా తోస్తుంది.

"ఉప్పొంగి పోయింది గోదావరి
తాను తెప్పున్న ఎగసింది గోదావరి –" అంటూ వరద గోదావరిని వర్ణించారు అడవి బాపిరాజు గారు.

విద్వాన్ విశ్వం పెన్నేటి పాట

ఈ కావ్యం లో కవి "కోటి గొంతుల కిన్నెర మీటుకొనుచు, కోటి గుండెల కంజరి కొట్టు కొనుచు" రాయల సీమ కన్నీటి పాట వినిపించారు.

" ఇదే పెన్న ఇదే పెన్న నిదానించి నడు
విదారించు నెదస్ వట్టి ఎడారి తమ్ముడు" అని నీరు లేని పెన్నా నది వాస్తవ స్థితి వర్ణించి చదువరులకు కన్నీరు తెప్పించారు.

విశ్వనాథ వారి కిన్నెర సాని పాటలు

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు రచించిన కిన్నెరసాని పాటలు ఒక అపూర్వ సృష్టి. గోదావరి నది యొక్క ఉపనది కిన్నెర . ఇది కొండ చుట్టూ తిరిగి ముందుకు సాగుతుంది. ఆ దృశ్యాన్ని కాంచిన కవి హృదయంలో ఒక రస గంగా ప్రవాహం ఉప్పొంగింది. అదే కిన్నెర సాని కావ్యమై రూపుదిద్దుకుంది.

కిన్నెర అత్తింటి కోడలు. భార్య భర్తలు చాలా అన్యోన్యంగా ఉంటారు. అత్తింటి బాధలు భరించలేక కోపోద్రిక్త అయిన కిన్నెర అడవిలోకి పరిగెత్తింది . భర్త ఆమెను పట్టుకోవటానికి ప్రయత్నించగా ఆమె కరిగి నీరైయ్యింది. భర్త రాయి అయ్యాడు. కిన్నెర నదిగా మారిన తీరు, భర్తను వదిలి వెళ్ళలేక కిన్నెర పడిన ఆవేదన, ఇత్యాది అంశాలు చదివి కిన్నెరసాని తో పాటు పాఠకులు కూడా కరిగి నీరౌతారు.

"కరిగింది కరిగింది కరిగింది కరిగింది
కరిగి కిన్నెరసాని వరదలై పారింది
తరుణి కిన్నెర సాని తరకల్లు కట్టింది

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in



పడతి కిన్నెరసాని పరుగుల్లు పెట్టింది".

విశ్వంభర లో సరిత్తులు

సి. నారాయణ రెడ్డి గారు రచించిన "విశ్వంభర" జ్ఞానపిఠ పురస్కారం పొందిన విశిష్ట కావ్యం. ఇందులో కవి ఆదిమానవుడు అణుయుగం వరకు ప్రస్థానం సాగించిన తీరును వర్ణించే క్రమంలో నదుల పాత్రను ప్రస్తావించారు. అడవిలో క్రూర మృగాల మధ్య భయపడుతూ రోజులుగడిపే మనిషి నదీ పరివాహక ప్రాంతాలలో ఆవాసం ఏర్పరుచుకున్న విషయాన్ని ఇలా కవితాత్మకంగా వ్యక్తికరించారు

"గుహ లోని గోళ్లకు జడిసిన మనిషికి
గూడయ్యింది ఏటిగట్టు
జాలువారే ఆ యేరు తోచింది తనకు
పాల వేళ్ళతో నిమిరినట్టు '

నదులను రహదారులుగా మార్చుకున్న మనిషి మేధస్సును కీర్తిస్తూ

"ఏటిని చీల్చాడు రెండుగా, ఈటెల్లాంటి చేతులతో
నడిచాడు కడలి అంచులపై, పడవల అరికాళ్ళతో" అని వర్ణించారు.

మోనా రచించిన" నది కావ్యం"

నదినే వస్తువుగా గ్రహించి రచించిన కావ్యమిది. భావుకతను అక్షరక్షరంలో పొదువుకున్న రసరమ్య కావ్యం. ఈ కావ్యంలో కవి నదిలో మానవ జీవితాన్ని దర్శించారు. నదికి మనిషికి గల అవినాభావ సంబంధాన్ని వేల వేల గొంతుకలతో చాటిచెప్పారు. వందలాది ఉపమానాలతో, ఉత్ప్రేక్షలతో నది విశ్వరూపాన్ని సాక్షాత్కరింప చేసారు. నదీమ తల్లులకు అక్షర నీరాజనమిచ్చారు.

"పడవలను పాపలుగ
ఎడద పై మోయుచూ
సంసార జలధిలో
సాగెడు తల్లిగా – అనురాగ వల్లిగా " నదిని భావించారు కవి .

"ప్రపంచ కావ్య సంపుటిలో
రసాత్మక మహా కావ్యంలా ఉంది నది" ఇలా నది లో కావ్యాన్ని దర్శించారు మోనా.

బేతవోలు రామబ్రహ్మం గారి కొత్త గోదావరి

కొత్త గోదావరి ఖండకావ్య లక్షణాలు, శతక లక్షణాలు గల కావ్య ప్రక్రియ. గోదావరిని దర్శించినపుడు, స్మరించి నపుడు కవి మనసులోని భావ వీచికలకు అక్షర రూపమే ఈ కొత్త గోదావరి. కవి తన మనసులో భావాలను గోదావరితో చెబుతున్నట్టుగా పాఠకులతో పంచుకున్నారు.

గోదావరిని ఎన్ని సార్లు దర్శించినా తనివి తీరనట్లు, గోదావరిలో పదే పదే మునకలేసి మురిసిపోయినట్టు సాహితి ప్రియులు ఈ కొత్త గోదావరితో తాదాప్యం చెందుతారు. బాహ్య ప్రపంచాన్ని మరచి కావ్య పఠనంలో మునిగిపోతారు.

"విస్తృత ఖండ కావ్యాలకు ఒరవడి కొత్త గోదావరి" అనే పేరుతో చేకూరి రామారావు గారు ఈ పద్య కవితా సంపుటిని పరిచయం చేస్తూ రాసిన ముందు మాట ఈ కావ్య ఘనతను చాటి చెబుతుంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:14, Issue:12(3), December, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

"ఒక వాన కురిసి వెలిసిన సాయంకాలం ఒంటరిగా బిగ్గరగా మెల్లగా చదివి సంభావించుకోదగిన పద్య సంభారమిది. గోదావరి నదీ తీర పులిన తలాలలోనో, వాస్తరంగాలపై ఉయ్యాలలూగే పడవ ప్రయాణం లోనో భావకులు చదివి భావనా లోకంలో విహరిపదగిన పద్య సంపుటి ఇది".

ఇలా ఎందరో కవులు నదులకు అక్షరార్చన చేసారు. సర్వ ప్రాణులకు మేలొనరించే నదీమ తల్లులను స్మరించుకోవాలనే ఒక ప్రయత్నమే గాని, నదిని ఒక పాత్రలోకి పట్టలేనట్టే , నదీపరమైన విస్తృత రచనలను ఒక వ్యాసంలో వివరించటం అసాధ్యం.

జన జీవ నాడులై , జాతికి సిరి సంపదలు ప్రసాదించే నదీమ తల్లులను ఎంత కీర్తించినా తక్కువే . నేడు మానవుల నిర్లక్షం కారణంగా నదులు కాలుష్య కూపాలుగా మారుతున్నాయి. ఓవైపు నదులను దేవతలుగా భావిస్తూనే మరోవైపు తమ స్వార్ధంతో నదులకు సమాధులు కడుతున్నారు. రకరకాల వ్యర్ధాలతో నదులను పూడుస్తున్నారు. మానవాళి మాలిన్యాన్ని పోగొట్టే నదులు నేడు కాలుష్యంతో కునారిల్లుతున్నాయి. ఈ నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇరవై వేల కోట్ల బడ్జెట్ తో "నమామి గంగే " పేరుతో గంగానది కాలుష్య ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అస్సాం ప్రభుత్వం 2015 లో "క్లీన్ బ్రహ్మ పుత్ర' పేరుతో బ్రహ్మపుత్ర పునరుజ్జీవనానికి కృషి చేస్తుంది. ఇలాంటి బృహత్తర కార్య క్రమాలు మరింతగా చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. మన జీవనాధారమైన నదులను సంరక్షించు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది. భావి తరాలకు ఆస్తులు కూడబెట్టటం కంటే, నిండుగా మెండుగా ప్రవహించే నదులను బహూకరించటం మేలైన మార్గం.

"భద్ర గిరి రామ పాదుకా స్పర్శనంబు
గణన కెక్కిన కోటి లింగాల పూజ
కలిగి పయనించు హంసికా గమన వీవు
గౌతమీ గంగ రమ్ము స్వాగతమ్ము గొమ్ము" [గుర్రం జాషువా ]

<u>ఉపయుక్త గ్రంథాలు</u>

ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, ప్రజాశక్తి బుక్ హౌస్ , ముద్రణ మే,1991.
జాషువా [జాషువా సర్వలభ్య రచనల సంకలనం]ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి.
డాక్టర్ ద్వా.నా.శాస్త్రి ,తెలుగు సాహిత్య చరిత్ర,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రథమ ముద్రణ, అక్టోబర్,1998.
నది [కావ్యం], మోనా ప్రథమ ముద్రణ ,ఆగస్టు,1978.
బేతవోలు రామబ్రహ్మం, కొత్త గోదావరి [పద్య కవితా సంపుటి]ప్రథమ ముద్రణ, అక్టోబర్,1991.
మహా భారతం, పిలకా గణపతి శాస్త్రి, త్రివేణి పబ్లిషింగ్ హౌస్, డిశంబర్,2012.
రంగనాథ రామాయణం, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ అక్టోబరు 19 89
వసుచరిత్ర, రామ రాజ భూషణుడు, తెలుగు విశ్వ విద్యాలయం, 1995.
విజయ విలాసం, చేమకూర వేంకట కవి, EMESCO POCKET BOOK, NOV 1997.
విశ్వంభర, డా.సి.నారాయణరెడ్డి, విశాలంద్ర పబ్లిషింగ్ హౌస్ ,తృతీయ ముద్రణ, మార్చి, 1996.
శతక మంజరి, RUSHI PRACHURANALU, First Edition 2004.
శ్రీమత్ ఆంధ్ర మహాభారతం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, ప్రథమ ముద్రణ 1971
andhrabharati.com